# కావ్యగానం

సర్వర్ మంచినీళ్ళ గ్లాసులు తెచ్చిపెట్టాడు.

'ఏమున్నాయ్'

'ఇడ్లీ దోసె, ఉప్మా, పెసరట్. వడ. గారె. పూరీ, ఊతప్పం, బజ్జీ, బోండా, ఆలూబాత్, టమేటో ఆమ్లెట్, కట్‌లెట్, మిక్చర్, సమోసా సార్.'

ఈ జాబితా ఎప్పుడు ముగుస్తుందా అని ఆత్రంగా ఎదురుచూస్తున్న నేను 'ఓ రెండిడ్లీ కాఫీ తెచ్చిపెట్టు' అన్నాను.

'మీకుసార్' సర్వర్ నాకెదురుగా కూర్చున్న పెద్దమనిషి నడిగాడు. నేను తల వంచుకొని స్థానిక దినపత్రిక పుటలు తిప్పుతూ వున్నాను.

ఆయన చెప్పాడు 'ఇదుగో చూడు సర్వరూ - రెండు ఇడ్లీ - మృదువుగా వుండాలి. లేత అరిటాకువేసి క్రింద - దానిలోపెట్టు - పక్కన ఓప్లేట్లో కారప్పొడి, అదీ చిన్నవుల్లీ శనగబేడలూ వేపింది - అదీ దాన్లో రెండుస్పూనుల నెయ్యి వేయాలి. కారప్పొడి కారం కారంగా వుండాలి. మరోప్లేట్లో కొత్తిమీరా కరేపాకు, పుట్నాలు, పల్లీపప్పు దోరగా వేయించి తిరగమోత మెరపకాయలూ ఆవాలూ పైకి కన్పడుతూ వుండేట్లు చేసిన ఆ శనగచట్నీ వుందే ఆ గట్టి చట్నీ పట్రా - ఇడ్లీ వేడివేడిగా వుండాలి. కారప్పొడి కారకారంగా వుండాలి. శనగ చట్నీ ఘట్టిగా వుండాలి...."

ఈ వర్ణన విని నా నోట్లో నీళ్ళూరాయి ముందే. తల పైకెత్తి చూచాను కుతూహలంతో. ఆ పెద్దమనిషిని నేను పరిశీలిస్తున్నానన్న విషయం పట్టించుకునే ధోరణిలో లేడిప్పుడు 'ఇదిగో చూడు సర్వరూ - ఈ ఇడ్లీ తినేలోగా దోసె కాలుతూవుంటుంది. అందుకని ముందే దానికి ఆర్డరియ్యి - దోసెంటే దోసె కాదు - పెసరట్టు - అట్టు దోసే పర్యాయపదాలుకదా! ఆ దోసె అంత ఎర్రగానూ ఉండకూడదు. అంతకాలనూ కాలకూడదు - దోరదోరగా వేగాలి - అందులో పచ్చిమిర్చి కత్తితో ముక్కలు ముక్కలుగా తరిగి, వేగిన ఉల్లిపాయ

లున్నాయి చూడు వాటినీ కలిపి ఉల్లి పెసరట్టు తెచ్చిపెట్టు - పెసరట్టు రిఫైండ్ ఆయిల్‌తో చేయాలి - దానితో ఆలూకర్రీ, గట్టి చట్నీ కూడా తెచ్చి పెట్టు-'

సర్వర్‌కు ఇంత సహనం ఎక్కడినుంచి వచ్చిందో నాకర్థంకాలేదు - అలా వింటూనేవున్నాడు - 'ఇదిగో చూడు. ఆ దోసె అంచులు కొంచెం ఎర్రగా కాలనియ్యి - దాన్ని నడిమికి మడిచి తీసుకురాకు - దోసె ముంచుకొని తినడానికి ఉల్లిపాయలతోసహా ఓ ప్లేటు సాంబారు పట్రా'

'పెసరట్టుకు అలుకర్రీయే ఇస్తారు సార్ - సాంబార్ ఎక్స్ట్రా"

'అలాగేనయ్యా - అరినీ అమ్మకడుపు బంగారంకానూ - నేనేం ఇవ్వ నన్నానా - అలాగే పట్రా పో'

సర్వర్ పక్క టేబిల్ దగ్గరకు పోయాడు-

ఈలోగా పెద్దమనిషికి మళ్ళీ ఏదో గర్తొచ్చినట్లుంది.

'ఇదిగో చూడు-ఆ దోసెకూడా లేత అరటాకు ముక్కలోనే వేసుకురా- మాడుపాకులో కోణాల పళ్ళెంలోనో తెచ్చేవు సుమా... ' అని కేక వేశాడు.

ఇదంతా గమనించాక ఆయనెవరో తెలుసుకోవాలనే కుతూహలం ద్విగుణీ కృతమైంది నాలో...

'మిమ్మల్నెక్కడో చూచినట్లుంది సార్' అన్నాను కేవలం మాట కలుపు కోవడంకోసం.

'అహ్హహ్హ - ఎక్కడేమిటి నాయనా - భాషానిలయంలో చూచివుంటావు- లేదా రవీంద్రభారతిలో చూచి వుంటావు- వై యం.సి.ఏ లో చూచివుంటావు. కాదంటే కవి సమ్మేళనాలల్లో చూచివుంటావు - పత్రికల్లో తరుచు చూస్తూనే వుంటావు - ఈ చిక్కడపల్లి హోటల్లో సరేసరి - నన్ను చూడటానికేమి నాపేరు ఆనందం కదూ-'

నిజమే! మహాకవి ఆనందం అన్న పేరు తరుచు వింటూవున్నట్లుగానే గుర్తుకొచ్చింది - నాకంతగా ఈ కవిత్వమూ గానమూ, కవిసమ్మేళనాలూ వగ్గైరా పట్టవు. ఏదో సరదాకు చాలా లైట్‌గా వుండే కథలు చదువుతూ వుంటాను - లేదా ఇతడు మహాకవి అని లోకులంతా నిశ్చయించి ఏ సన్మానమో సంతర్పణో చేస్తే కాబోలుననుకొని సంతోషిస్తాను - అంతే!!

సర్వరు ఇద్దరికీ ఇడ్లీప్లేట్లు ఇచ్చిపోయాడు.

'అన్నట్లు నీవెవరో చెప్పావుకాదు బాబూ' అంటూ ఆనందంగారు తన ప్లేటువైపు చూదుకున్నాడు- పురాణమైతే ఓపికగా విన్నాడే కాని సర్వరు ఇద్దరికీ ఇచ్చిన ప్లేటలో తేశా ఏమీ చూపలేదు.

నా పేరూ చేసే ఉద్యోగమూ చెప్పాను. 'చాలా సంతోషమండీ - ఇవ్వాళ మిమ్మల్ని పరిచయం చేసుకోవడం' అన్నాను మర్యాదకొరకు, విజిటింగ్ కార్డు నాదొకటి వారికిస్తూ. ఆనందంగారు ఉబ్బి తబ్బిబ్బై పోయారు - సర్వరు కాఫీ లందించి బిల్లు తెచ్చి పెట్టాడు - ఆనందంగారు చటుక్కున నా బిల్లు తమచేతి లోకి తీసుకున్నారు.

'అయ్యొయ్యో - అదేమిటండీ' అని నేను నివారించ ప్రయత్నించినా కూడా ఆయన వినిపించుకోలేదు. 'అమాత్రం దానికేనా - చూడు బాబూ నీ పేరేమన్నావు మరచాను'

'చంద్రశేఖరం.'

'ఆఁ - చంద్రశేఖరం - నీవంటి మంచి రసికుడూ, సాహితీప్రియుడూ దొరకడం నాకు చాలా ఆనందకరమైన విషయం - నిజంగా నాకివ్వాళ విందు భోజనమనుకో' అని ఇడ్లీ గబగబా తిన్నాడు-

నేను కాఫీ ముగించేలోగా దోసె వచ్చింది. ఆ దోసెకు ఆనందంగారు వర్ణించిన "పెసరట్టు" లక్షణాలేమీలేవు. పురాణమంతా విని సర్వర్ లోపలికివెళ్ళి 'ఆనియన్ పెసరట్ రోస్ట్' అనిమాత్రం ఓ పొలికేక వేయడం నేనూ విన్నాను.

ఈ కేక ఎవరు పెసరట్టుకు అర్డరిచ్చినా ఇలాగే వుంటుంది కదా!!

'వస్తావుకదా' బిల్లు చెల్లిస్తూ అన్నాడు-

'ఆఁ - అలాగేనండీ వీలు చూచుకొని'

'అదేమిటయ్యా - వస్తావుకదా అంటే ఇప్పుడు నా వెంటే మా ఇంటికి వస్తున్నావుకదా అని అర్థం - ఇవ్వాళ శెలవేకదా - పద పద కాస్త కావ్యరసం రుచి చూద్దువుగాని." నా చెయ్యి పట్టేసుకొని చార్మినార్ సిగరెట్ ఫాక్టరీవైపు నడవడం మొదలుపెట్టాడు - నేను మొగమాటంలో పడిపోయి మాట్లాడకుండా ఆయన్ను అనుసరించాను- అందులోనూ ఇప్పుడే నా కాఫీ బిల్లు చెల్లించాడాయె-

ఇంకేం మాట్లాడను ??

ఆనందంగారు హుషారుగా నడుస్తున్నారు. క్రమంగా ఆ రోడ్డు వెళ్ళి యూనివర్సిటీ రోడ్డులో కలిసే వరకూ కబుర్లు చెపుతూ నడిపించారు -

"అసలు నా కవిత్వం గూర్చి నీ అభిప్రాయమేమిటి శేఖరం''

నేను తన కవిసమ్మేళనాలేవో విన్నాననుకున్నట్లున్నాడు.

'మీరు వర్ణనాప్రియులండీ - ప్రతిదాన్నీ చక్కగా వర్ణిస్తారు' పెసరట్టు క్రింద వేయమన్న లేత ఆరిటాకును గుర్తుకు తెచ్చుకుంటూ అన్నాను.

'కరక్ట్ - నాయనా - నువ్వు మామూలు మనిషివికావు - మహా విమర్శక చక్రవర్తివి - షేక్స్పియరుకు బ్రాడ్లేలాగా నా కావ్యాలన్నిటికీ నీవిక భాష్యాలు వ్యాఖ్యానాలు వ్రాయగలవు - నేటికి దొరికావు - తగినవాడివి. ఇంక వదలను వద' అని నా చెయ్యి గట్టిగా పట్టుకొని హిందీ ఆర్ట్స్ కాలేజీ పక్క సందు పట్టాడు - నాకు భయంవేసింది.

సింద్‌బాద్ కథల్లో 'సముద్రం ముసలి మనిషి (ఓల్డ్‌మాన్ ఆఫ్ ది సీ) గుర్తుకొచ్చాడు - అయినా గుండె చిక్కబట్టుకున్నాను - నేనేం భూతగృహంలో ప్రవేశించబోవడంలేదు. కవిత్వం వినడానికి వెళ్తున్నాను అంతే !

ఎప్పుడు నచ్చకపోతే అప్పుడు లేచి వస్తాను.

ఆ ధైర్యంతోనే ముందుకు సాగాను .

ఆనందంగారుంటున్న ఇంటి సమీపానికి వెళ్ళాము -

తాళం తీసి లోపలికి ప్రవేశించాడాయన.

తోకవెంట నారాయణా అంటూ నేనూ లోనికి ప్రవేశించాను. తొలిచూపు తోనే ఇంటి వాలకం పోల్చుకున్నాను. ఆనందంగారి సంసారం ఊళ్ళో ఉన్నట్లు లేదు ; ఏ పుట్టింటికో పోయారల్లే వుంది - ఆయన సరంజామా అంతా ముందు గదిలోనే వుంది - ఓ టేబిలు, కుర్చీ, కొన్ని న్యూస్‌పేపర్లు, పక్కనే ఓ కొయ్యతో చేసిన బుక్‌రాక్, దానినిండా ఏవో పాత వ్రాతప్రతుల కట్టలు, టేబిల్‌మీద ఓ ఫ్లాస్కూ - చాపను దుమ్ముదులిపి పరిచాడు. దానిపై కూల బడ్డాను.

'ముందు చతుర్థిలో నా జీవిత కావ్యం విన్పిస్తాను' అన్నాడు.

'అంటే ?'

'అంటే పుస్తకం ఒక్కటే - కాని గృహస్థునిగా, భక్తునిగా, కవిగా, ప్రేమికుణ్ణిగా నాలుగు కథలు నడుస్తాయి అందులో. శాబ్దికమైన శక్తినీ, శ్లేషనూ ఆశ్రయించి ఈ చమత్కారం సాధించానన్న మాట. చూడు చూడు భలే తాజాగా వుంటుందిలే .' అని ఇంక ఒక్క నిముషం కూడా ఆగకుండా 'శ్రీ-' అంటూ మొదలు పెట్టాడు పెద్దగా -

'శ్రీ' అంటూ రాగయుక్తంగా సాగదీస్తుంటే నాకు సిగరెట్టు ఫ్యాక్టరీ సైరను కూత గుర్తు కొచ్చింది - ఆనందంగారు మాత్రం రసానందంలో మునిగి పోయి ఆపకుండా పద్యం వెంట పద్యం చదువుతున్నాడు . నేను స్థాణువులా కూర్చొని కేవలం నిమిషాలు లెక్కబెడుతున్నాను. మధ్య మధ్య తలను మాత్రం ఊపిస్తూ - వింటున్నానన్నందుకు సూచనగా -

నూట ఇరవై నిమిషాలు కరిగిపోయాయి -

- రెండు గంటలు !

గట్టిగా నిట్టూర్చాను. 'ఎంత వరకు వచ్చింది ?'

'ఇదిగో ఇప్పటి వరకూ పురవర్ణనా గట్టా అయిపోయింది - ఇహ చూడు ఇప్పుడే ప్రారంభం కాబోతున్నది రసం - నువ్వే చూస్తావుగా' మరింక వినిపించు కోకుండా తరువాతి పద్యం లంకించుకున్నాడా పెద్దమనిషి

'ఈ పురవర్ణనా గట్టా' లకే రెండు గంటలు పట్టిందే ఇంక ఈ రసానికీ వర్ణనకూ ముగింపు ఎప్పుడు ??

ఏమి చేయాలో తోచలేదు - 'రామచంద్రా' అని పరమేశ్వర ధ్యానం చేయసాగాను మనస్సులో....నిమిషాలు దొర్లుతున్నాయి - పద్యాలు పరుగెత్తు తున్నాయి - కావ్యగానం మాత్రం ఆగలేదు -

బొత్తిగా మన తెలుగు వాళ్ళకి ఒకటే చాదస్తం - కాల నియమం తెలియదు . విలువ అసలే తెలియదు - ఏమిటీ దారుణం - అరసికుడి ముందు ఈయన కావ్యగానం, అనుకున్నాను నాలో ! చాలా రోజులకుగాను నెను దొరికానో ఏమో ఆకలిగొన్న బెబ్బులి లాగా నమిలి పారేస్తున్నాడు ఈ ఆనందం కవిత్వాన్ని ! చెప్పొద్దూ ఆయన మీద కల గౌరవమంతా పోయింది నాకు .

పద్యాలు ధనధనా ఘణా ఘణా మోగిపోతున్నాయి -

గడ్డపలుగుల్లాగా దిగబడుతున్నాయి -

'ఈశ్వరా ! నాకు విముక్తి ఎప్పుడు ?' . ఇదేదో ఈయన గమనించ లేదు - పై కప్పు అదిరిపోయేలా సాభినయంగా కవిత్వం వల్లిస్తున్నాడు -

కొంతసేపైన తర్వాత నేనే మర్యాదగా అన్నాను - 'ఆనందంగారూ... చూడండి'

'అబ్బాయ్ - ఇక్కడ చూడటమేమీలేదు - అంతా వినడమే - ఊ( - కాలయాపనతో రసభంగం చేయకు - ఈ పట్టుపట్టనీ....'

అంతా వినడమే కాని చూడటమేమీ లేదట. నెనె వ్యర్థంగా కాలయాపనా రసభంగమూ చేస్తున్నానట - పట్టిన పట్లకన్నా మించిన బలమైన మరో పట్టు పడ్తాడట !

గత్యంతరంలేక గట్టిగా కళ్ళు మూసుకున్నాను - రెండు నిమిషాలు గడిచేసరికి డొక్క లదిరిపోయే పోటు పొడిచాడు ఆనందం నన్ను -

దిమ్మరపోయి కళ్ళు తెరిచాను-

'ఏమిటది' హుంకరించినట్లు ప్రశ్నించాడు.

'అ(- అ(- వింటూనేవున్నాను కదా - కళ్లుమూసుకొని'

'కళ్లుమూసుకొని ఏం వింటావయ్యా పంతులూ - కళ్ళుమూసుకుంటే నిద్ర వస్తుంది-ఆ తర్వాత పక్కా తలగడాకావాల్సివస్తుంది.ఇంకేమిటి నా కావ్యగానం- తెరుచుకో పుచ్చపువ్వుల్లా కళ్ళు విప్పార్చి విను - అంతేకాదు మధ్య మధ్య 'వహ్వ వహ్వ' అంటుండాలి ముషాయిరాలలోలాగా - తల గిరగిర ఊగించాలి సంగీత కచ్చేరీలలో తొలివరుస శ్రోతల్లాగా - కావ్యశ్రవణం అంటే ఏం మజాకా అనుకున్నావా - విను" ఆనందం మళ్ళీ తన ధోరణిలోకి పోతున్నాడు పేజీలో పంక్తులు వెతుకుతూ - 'అయ్యా నాకీ గ్రంథం అర్థంకావడంలేదండీ' ఖండితంగా చెప్పాను చివరకు ఎలాగోలా సాహసించి - లేకుంటే ఇంకెంతకాలమీ చిత్ర హింస ఇద్దరికీ - ఆయన ఆకస్మాత్తుగా, నిర్మొగమాటంగా రాలిన ఈ పిడుగుకు కొంచెం తెల్లబోయాడు - వెంటనే ముఖం చాటంత చేసుకొని నవ్వు తెచ్చి పెట్టు కోని 'అలా చెప్పు భడవా! నీకు క్లాసికల్ పోయిట్రీ నచ్చదన్నమాట. దానికేం లైట్ పోయిట్రీ విన్పిస్తాను - నాదగ్గర అన్ని వెరైటీలూ వున్నాయి - మార్గ

కవిత్వం, దేశికవిత్వం, జానపద కవిత్వం, సినిమాగీతాలు, క్లబ్బుడాన్సు పాటలూ శ్వేతాంబర కవిత్వం, దిగంబర కవిత్వం, గాంధీ ప్రచారగీతాలూ, నక్సలైటు పాటలూ ఎవరికేవి కావాలంటే అవే విన్పిస్తాను - మంచిది - లలిత సంగీతం ఖమీన్ సాహిత్యం వినుమరి" గూట్లోని పుస్తకాల దొంతరలు సర్దుతున్నాడు - నాకు గుండె గుభేలుమంది. దానితోపాటు అసహ్యంకూడా వేసింది. బొత్తిగా కొత్తవాణ్ణి - అందులోనూ మరీ గుంటణ్ణేమీకాదు. ఆయన ఎంత పెద్దమనిషైతేనేమిటి 'ఖడవా' అంటాడా నన్ను - ఎవరిచ్చారీ చనువు ఈయనకు??

"ఆనందంగారూ క్షమించండి. నాకు అర్జంటుగా అవతల మరో పనివుంది - కొంప మునిగిపోయే పని - వెళ్ళక తప్పదు - కావ్యగానం మరోసారి చూద్దాము" లేవబోయాను మెల్లగా. దానితో ఠపీమని ఆనందం నా చొక్కా దొరకపుచ్చుకున్నాడు "చాల్లేవయ్యా - ఎక్కడికి పోతావు నువ్వు - ఇలాంటి అర్జంటుపనులు ఎప్పుడూ వుంటూనేవుంటాయి. కావ్యగానం మళ్ళీ మళ్ళీ రమ్మంటే వస్తుందా? ఏదీ ఈ రోజంతా బ్రహ్మానంద సబ్రహ్మచారియైన యీ రసానందంలో గడుపు. కొంప ఎలా మునుకుపోతుందో చూద్దాము - పిచ్చివేషాలూ నువ్వూనూ - చాలు చాల్లే - కూచో - కదలకెక్కడికి. నువు లక్షలిచ్చినా రాదీ కవిత్వం - కోట్లు ఖర్చుచేసినా మహాకావ్యామృతం దొరకదు - ఇదుగో ఇది విను" ఒకచేత్తో నా చొక్కా పుచ్చుకొని రెండోచేత్తో పుస్తకం మరొకటి విప్పుతున్నాడు. దీనితో ఈయనకేదో మతిస్థిమితం లేనట్లున్నదని నిశ్చయించుకున్నాను. ఈ భావం రాగానే నాకు ఒక్కసారి భయంవేసింది. పులినోట్లోపడ్డ మేకలాగా గిలగిల కొట్టుకున్నాను. ఒక్క అదటున నా చొక్కా లాక్కొని జోళ్ళు తగిలించుకొని పరుగున వీధినిపడ్డాను. అనుకోని ఈ విపరీతమైన సంఘటనకు ఆనందం నిర్ఘాంతపోయి కళ్ళజోడు ముక్కుమీదకు లాక్కొని అలా నావైపు చుస్తూ వున్నాడు.

ఆ తర్వాత రెండురోజుల వరకూ ఈ సంఘటన నన్ను వెన్నాడుతూనే వుంది - మనస్సులో ఏదో కలతగా కదులుతూవుంది - మూడోనాడు పోస్టుమాన్ తెచ్చిన ఉత్తరాలలో ఒక ఉత్తరం ఇలావుంది.

"చంద్రశేఖరానికి, ఆశీర్వాదములు.

నాయనా! ఈ ఉత్తరం వ్రాయాలని నీవు ఆశించకపోయినప్పటికీ నా మనస్సు సంతృప్తికోసం వ్రాస్తున్నాను. ఇది జూచి నన్ను నీవు పిచ్చివాడని అనుకోవచ్చు. అయితే అలా పిలవబడటానికి నేను అలవాటైనాను కాబట్టికొత్తగా నాకేమీ బాధలేదు. కాని నిజానికి నేను పిచ్చివాణ్ణో సమాజం పిచ్చిదో నాకు తెలియదు. పూర్వం రాయలవంటివాళ్ల అక్షర లక్షలిచ్చి కావ్యాలు వ్రాయించి ఆదరించారట. కాని ఇవ్వాళ నాలాంటివాళ్ళు మిమ్మల్ని బతిమిలాడినా, వచ్చి కావ్యాలు వినడంలేదు. సమాజం ఇలా మారిపోయింది. సమాజానికి డబ్బు, రూపాయినోట్లు, ఇంక్రిమెంట్లు తప్ప మరేమీ అక్కర్లేదు - ఇదే మళ్ళీ ఫలాని ఆనందం కావ్యంలో ఇరవై మార్కులు తెచ్చుకుంటే ఓ అయిదు రూపాయల జీతం పెంచుతామనండి. రాత్రింబవళ్ళు ఈ ప్రజలు నా పుస్తకం తిండీతిప్పలూ మానేసి చదువుతారు - ఆ టెస్టుకోసం! ఇదీ ప్రస్తుత పరిస్థితి.

నేనింకా పాత తరంవాణ్ణి కనుక కొంత పైత్యమూ, మరికొంత చనువూ, కాస్త చాదస్తమూ ఇంకాస్త నిజాయితీ మేళవించి నా మనస్సులోని భావాలను ప్రవర్తనకూ పొరలూ తెరలూ కట్టకుండా నగ్నంగా నీముందు ప్రదర్శించి పరిహాసానికి పాత్రుణ్ణయినాను. కానీ చంద్రశేఖరం!నేను వేసే ఈ ఒక్క ప్రశ్నకూ సూటిగా సమాధానం చెప్పు చాలు - అంతకంటే నేనింకేమీ కోరను - నా కావ్యం నిజంగా అంత భయంకరంగా వుందా? ఒక్క అక్షరం కూడా అర్థంకావడం లేదా?? నా పై ఆఫీసరు తిట్లు ఎంత భయంకరంగా వున్నాకూడా కుక్కిన పేనులా సహించి నీవూ నీలాంటి లక్షల ప్రజలూ సహించి తిరుగుతారే ఓ గంట నా కావ్యగానం సహించలేకపోయావా?? నిజంగా ఈనాడు 'గొప్పవాళ్ల'ని సమాజంచేత బోర్డు కట్టబడ్డ మహామహుల రచనలన్నీ నీకు అర్థమయ్యే చదువుతున్నావా? కాదు - ఏంచదువుతున్నావని ఎవరన్నా ప్రశ్నిస్తే నీచేతిలో పుస్తకం అట్టజూపి ఫలానావాళ్ళ రచన - అని చెప్పి కొంత ఘనత సంపాదించుకుందామని మాత్రమే చదువున్నావు. నా జీవిత చరిత్రను నేనే డబ్బా మోగించుకుంటున్నానని ఛలోక్తిగా ఇప్పటికే నీ ఫ్రండ్స్ అందరికీ చెప్పి వుండవచ్చు. చెపితే చెప్పావు. కాని శేఖరం - వేదికలపైనా, దినపత్రికలలోనూ వచ్చే వేలిముద్రల రాజకీయ నాయకుల సుదీర్ఘ హితోపదేశాలూ డబ్బిచ్చి చేయించుకున్న సన్మాన ప్రసంగాలు చదివే ఓపికమాత్రం నీకుంది కాని నా కావ్యం వినే ఓపిక నీకెందుకులేదు?? కారణం నేను రాజకీయ నాయకుణ్ణి నేను - సినిమాతారను

కాను. ఆకర్షణీయమైన ఏ డాన్సరునో అయివుంటే నీ తరం యువకులతోపాటు నాతరం ముసలివాళ్ళు కూడా 'కళారాధన' అనే మిషతో చొంగకార్చుకుంటూ గోచీలు ఎగదోపుకుంటూ వచ్చి సభలో ముందుసీట్లు అలంకరించి ఆనందిస్తారు. చంద్రశేఖరం - నీవు అవునన్నా కాదన్నా ఇది నిజం!! - బలవంతంగా ఓ రెండు గంటలు కూర్చోబెట్టినందుకు క్షమించు - నా బిడ్డలాంటివాడివన్న దృష్టితో పెద్దతనం నాకిచ్చిన అధికారంతో లేని చనువును ఉపయోగించుకొన్నందుకు మన్నించు - నేను ఇల్లు ఖాళీచేసి హైదరాబాదును విడిచి వెళ్ళిపోతున్నాను. నాకై నేను నా సంతృప్తికోసం సైకలాజికల్‌గా ఒక ప్రతిష్టావలయాన్ని నా చుట్టూ నిర్మించుకున్నానే కాని ఈ వార్త ఏ స్థానిక దినపత్రికలోనూ రాదని నాకు తెలుసు. ప్రేమతో నీ ఆనంద కవి" - అప్పటివరకూ ఓ జోక్ కట్ చేయడానికే వాడుకోదలచిన ఆనందం వృత్తాంతం నా వెన్నుమీద కొరడాతో బాదినట్లనిపించింది - ఉత్తరంలోని ప్రతి అక్షరమూ "నిజం - నిజ"మని అంగీకరించక తప్పలేదు నాకు.